# స్వయం, వేతన ఉపాధి... పరిశీలన

**సంస్కరణల యుగంలో భారత్ అభివృద్ధి బాటలో శరవేగంగా పయనిస్తుందనడంలో సందేహంలేదు. కానీ ఆ ఫలాల పంపిణీ అందరికీ సమంగా జరగలేదు. దీంతో కొన్ని వర్గాల సంక్షేమం కోసం, ముఖ్యంగా ఉపాధి విషయంలో ప్రభుత్వ జోక్యం ఎంతో అవసరం. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం పట్టణ ప్రాంతాలకు వలసలు పెరుగుతున్నా అవకాశాలు లభించట్లేదు. ప్రభుత్వం కొన్ని స్వయం, వేతన ఉపాధి పథకాలను అమలు చేసినా అవి ఆశించిన పురోగతి సాధించలేదు. ఈ నేపథ్యంలో.. దేశంలో స్వయం, వేతన ఉపాధి అవకాశాలపై పరిశీలన..**

## స్వయం ఉపాధి కార్యక్రమాలు:

సమీకృత గ్రామీణాభివృద్ధి కార్యక్రమం (IRDP) పేరుతో.. 1970లలో స్వయం ఉపాధి పథకం ప్రారంభమైంది. భూమిలేని కార్మికులు, చిన్న రైతుల ఆదాయ మార్గాలను పెంచడమే ఈ పథకం ప్రధానోద్దేశం. ఈ పథకం లబ్ధిదారులకు సబ్సిడీతో కూడుకొన్న పరపతి, వృత్తి పరమైన శిక్షణనిచ్చారు. ఫలితంగా వ్యవసాయ శ్రామికులు, చిన్న రైతులు.. చేపల పెంపకం, పశుపోషణ వంటి వృత్తిపర శిక్షణ పొందారు. ఈ పథకాన్ని 1980లలో ఎస్సీ, ఎస్టీలు, మహిళలు, చేతివృత్తుల వారికి కూడా విస్తరించారు. ఈ పథకం అమల్లో కొన్ని సమస్యలు ఎదురయ్యాయి. ఎటువంటి నైపుణ్యంలేని, భూమి లేని కార్మికుల భాగస్వామ్యంతో పథకం లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమైంది. మరోవైపు పేద వర్గాలకు రుణాల మంజూరులో బ్యాంకులు ముందుకు రాలేదు.

## యువత కోసం ట్రైసెం:

గ్రామీణ ప్రాంత యువతలో నిరుద్యోగ నిర్మూలన కోసం 1979లో గ్రామీణ యువకులకు శిక్షణ కార్యక్రమం 'ట్రైసెం'ని (TRYSEM) ప్రారంభించారు. ప్రతి ఏటా సుమారు 2 లక్షల మంది గ్రామీణ యువకులకు స్వయం ఉపాధిలో శిక్షణ ఇవ్వడం దీని లక్ష్యం. ఇందుకోసం ప్రతి బ్లాక్ నుంచి 40 మంది యువకులను ఎంపిక చేస్తారు. గ్రామీణ ప్రాంతాలకు చెంది, కుటుంబ ఆదాయం ఏడాదికి రూ. 3,500 కంటే తక్కువగా ఉన్నవారు పథకంలో చేరడానికి అర్హులు. మొత్తం శిక్షణార్థుల్లో మూడో వంతు మంది మహిళలే.

## మహిళల కోసం డ్వాక్రా:

గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సాధికారికతను పెంచే ఉద్దేశంలో భాగంగా.. వారే స్వయం ఉపాధి పథకాలను చేపట్టే విధంగా డ్వాక్రా కార్యక్రమాన్ని 1982-83 నుంచి ప్రారంభించారు. IRDP కార్యక్రమంలో భాగంగా ప్రారంభించిన TRYSEM, డ్వాక్రా పథకాలను పునర్ వ్యవస్థీకరించి 1999 ఏప్రిల్ 1న 'స్వర్ణ జయంతి గ్రామ స్వరోజ్‌గార్ యోజన' కార్యక్రమాన్ని రూపొందించారు. ఎనిమిదో

ప్రణాళికలో 7 లక్షల మైక్రో ఎంటర్ ప్రైజెస్ ఏర్పాటుతో పాటు... విద్యావంతులైన పది లక్షల మంది నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడం కోసం ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజన (PMRY) ప్రారంభించారు. దీనిని తొమ్మిదో ప్రణాళికలోనూ కొనసాగించారు.

### వేతన ఉపాధి కార్యక్రమాలు:

వ్యవసాయ పనులు లేని సమయంలో, వరదలు, కరవు సంభవించినప్పుడు జీవనాధారం కల్పించడమే ఈ వేతన ఉపాధి కార్యక్రమాల ముఖ్య లక్ష్యం. ఇవి.. గ్రామీణులకు ఉపాధి కల్పన తోపాటు అవస్థాపన సౌకర్యాల మెరుగుదలకు కూడా దోహదపడతాయి. గ్రామీణ ప్రాంతాల్లో శ్రామికులకు డిమాండ్ పెరిగి వారి వేతనాల్లో వృద్ధికి ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయి. వేతన ఉపాధి కార్యక్రమాలను తొలుత ఆరు, ఏడు పంచవర్ష ప్రణాళికా కాలాల్లో ప్రారంభించారు. జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమం (ఎన్ఆర్ఈపీ), గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని పేదలకు ఉపాధి హామీ పథకం (ఆర్ఎల్ఈజీపీ) రూపంలో వీటిని మొదలుపెట్టారు. 1989లో ఈ రెండిటినీ 'జవహర్ రోజ్‌గార్ యోజన' (జెఆర్‌వై)లో విలీనం చేశారు. నిరుద్యోగిత, అల్ప ఉద్యోగితను తగ్గించడం ద్వారా ఉపాధి అవకాశాలను పెంపొందించడం జెఆర్‌వై లక్ష్యం. కానీ వాస్తవంలో ఈ పథకం ద్వారా లభించిన ఉపాధి చాలా స్వల్పం. తొమ్మిదో ప్రణాళికలో ఈ కార్యక్రమానికి వనరుల పంపిణీ తక్కువగా ఉండటమూ ఈ పరిస్థితికి కారణమైంది. జెఆర్‌వైని పునర్వ్యవస్థీకరించి.. 1999 ఏప్రిల్‌లో 'జవహర్ గ్రామ సమృద్ధి యోజన'గా తిరిగి ప్రారంభించారు. 1993-94లో జెఆర్‌వై 1.03 బిలియన్ శ్రామిక పని దినాలు కల్పించగా.. జవహర్ గ్రామ సమృద్ధి యోజన ప్రతి ఏటా 270 మిలియన్ శ్రామిక పని దినాలను మాత్రమే కల్పించింది. ఈ కార్యక్రమాన్ని పంచాయతీలు అమలు చేయడం.. అక్కడ అనుభవం, నిర్వహణ సామర్థ్యం లోపించడం వల్ల పథకం ఆశించిన ప్రయోజనాన్ని చేరుకోలేదు. ఈ పథకం అమలుకు పంపిణీ చేసిన వనరులు సరిపడనంతగా లేకపోవడం.. శ్రామికుల హాజరు విషయంలో చోటుచేసుకున్న అవినీతి కూడా ఈ కార్యక్రమం విఫలమవడానికి కారణాలయ్యాయి.

### కరవు ప్రాంతాల కోసం ప్రత్యేక పథకం:

కరవు పీడిత ప్రాంతాలు, ఎడారి, కొండప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక వేతన ఉపాధి పథకంగా 'ఉపాధి హామీ పథకాన్ని' అక్టోబర్ 2, 1993న ప్రారంభించారు. 1997-98లో దేశంలోని అన్ని బ్లాక్‌లకు దీన్ని విస్తరించారు. ఉపాధి హామీ పథకం (ఈ ఏఎస్)లో భాగంగా పనికి ఆహార పథకాన్ని 8 కరవు పీడిత రాష్ట్రాల్లో 2000-01లో ప్రారంభించారు. దీని ప్రకారం.. వేతనాల్లో భాగంగా ఆహారధాన్యాలను అందజేస్తారు. పలు ఉద్దేశాలకనుగుణంగా ప్రారంభించిన అనేక వేతన ఉపాధి పథకాలను విలీనంచేసి 2001లో 'సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన' (ఎస్ఈఆర్‌వై) కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ పథకం ప్రధానంగా మూడు లక్ష్యాలతో ప్రారంభమైంది. అవి..

- గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడం.
- మౌలిక సౌకర్యాలని మెరుగుపరచడం ద్వారా కమ్యూనిటీ అసెట్స్ సృష్టించడం.
- గ్రామీణ పేదలకు ఆహార, పౌష్టికాహార భద్రత కల్పించడం.

తొమ్మిదో ప్రణాళికలో అనేక వేతన ఉపాధి పథకాల పనితీరు పరిశీలిస్తే.. వాటి ప్రగతి అంత ఆశాజనకంగా లేదు. ఈ కార్యక్రమాల ద్వారా ఉపాధి కల్పనలో స్థిరమైన తగ్గుదల కన్పించింది. దీంతోపాటు ఉపాధి కల్పన వ్యయం కూడా పెరిగింది. దీనివల్ల కేవలం 2.86 బిలియన్ శ్రామిక పని దినాలను మాత్రమే కల్పించగలిగారు. ఆ సంఖ్య.. 8వ ప్రణాళికలో 5.13 బిలియన్ శ్రామిక పని దినాలు. అంతేకాక.. ప్రణాళిక ప్రకారం కేటాయించిన మొత్తాలు కూడా పూర్తిగా వినియోగం కాలేదు. మొత్తం మీద అనేక సమస్యలతో ఈ కార్యక్రమాలు సరిగా అమలుకు నోచుకోని పథకాలుగా మిగిలిపోయాయి.

## స్వయం ఉపాధితో కొంత మెరుగు:

వేతన ఉపాధి కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలను పోల్చి చూస్తే.. స్వయం ఉపాధి పథకాల పనితీరే బాగుందని చెప్పవచ్చు. 'స్వయం సహాయక బృందాల' ధృక్పథాన్ని అవలంబించడం వల్ల స్వయం ఉపాధి పథకాలు కాలానుగుణంగా కొంత ప్రగతి కనబర్చగా వేతన ఉపాధి పథకాల ప్రగతి కాలానుగుణంగా తగ్గింది. పేదల భాగస్వామ్యం స్థాయి ఆధారంగా ఈ రెండు కార్యక్రమాల మధ్య ముఖ్య తేడాను గమనించవచ్చు. స్వర్ణ జయంతి గ్రామ స్వరోజ్‌గార్ యోజన (స్వయం ఉపాధి పథకం) పథకం ద్వారా పేదల్లో సాధికారికత పెరిగింది. సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన (వేతన ఉపాధి పథకం) విషయంలో పేదలు పరోక్ష లబ్ధిదారులుగా మిగిలారు. అంతేకాక వేతన ఉపాధి పథకాల్లో పరిపాలన వ్యయం ఎక్కువగా ఉండటంతో పాటు అవినీతి కూడా పెరిగింది.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం:

గ్రామీణ ప్రజల్లో దారిద్ర్య రేఖ దిగువన నివసించేవారికి సెమి, అన్‌స్కిల్డ్ పని కల్పించి తద్వారా వారిలో కొనుగోలు శక్తి పెంపొందించడం ఈ చట్టం ముఖ్య లక్ష్యం. దేశంలో ధనిక, పేద ప్రజల మధ్య ఆదాయ అసమానతల్ని తగ్గించడానికి ఈ చట్టం ఉపకరిస్తుంది. కనీస వేతనం వద్ద పనిచేయడానికి ఇష్టపడ్డ గ్రామీణ కుటుంబాల్లోని వయోజనులకు ప్రతి ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల ఉపాధి కల్పించడం ఈ చట్టం ప్రధానోద్దేశం. తొలుత ఫిబ్రవరి 2, 2006న 200 జిల్లాల్లో ఈ పథకాన్ని ప్రారంభించారు. అప్పటినుంచి ఐదేళ్లలో దేశంలోని మొత్తం 596 జిల్లాలకూ విస్తరించాలని ప్రభుత్వం భావించింది. 2006-07 ఆర్థిక సంవత్సరంలో ఈ కార్యక్రమానికి బడ్జెట్లో రూ. 11,300 కోట్లు కేటాయించగా.. 2008-09 బడ్జెట్‌లో రూ.16,000 కోట్లకు పెంచారు. 2008 ఏప్రిల్‌లో ఈ పథకాన్ని దేశంలో అన్ని

జిల్లాలకు విస్తరించారు. ఇప్పటి వరకు ఉన్న వేతన ఉపాధి పథకాలకు భిన్నంగా ఈ కార్యక్రమం పేదరిక నిర్మూలనకు దోహదపడే అవకాశాలు న్నాయి. పంచాయతీరాజ్ సంస్థల ప్రణాళిక రూపకల్పన, పర్యవేక్షణ, అమలు ఫలితంగా ప్రజాస్వామ్య ప్రక్రియ వేళ్లూనుకొని వికేంద్రీకరణ విధానం పటిష్టమవడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుంది. అంతేకాక 33 శాతం మహిళా భాగస్వామ్యం తప్పనిసరని చట్టం చెబుతోంది.

ఈ కార్యక్రమం ద్వారా 2007-08లో 3.39 కోట్ల కుటుంబాలకు ఉపాధి లభించగా మొత్తం 330 జిల్లాల్లో 143.5 కోట్ల శ్రామిక పని దినాలు లభించాయి. 2008-09లో జులై వరకు 253 కోట్ల కుటుంబాలకు ఉపాధి.. 85.29 కోట్ల పనిదినాలు లభించాయి. కనీస వేతనాల కల్పన వల్ల శ్రామికుల ఆదాయాలు పెరిగి వారి జీవన ప్రమాణం పెరుగుదలకు ఈ కార్యక్రమం దోహదపడింది. 2007-08లో మొత్తం వనరుల్లో 68 శాతం, 2008-09లో 73 శాతం నిధుల్ని వేతనాలుగా చెల్లించారు. ఈ కార్యక్రమంలో దారిద్ర్యరేఖ దిగువనున్న లక్షిత వర్గాల ప్రజల భాగస్వామ్యం స్పష్టంగా కన్పించింది. 2007-08లో మొత్తం శ్రామికుల్లో 57 శాతం ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందినవారు. కాగా, 43 శాతం మహిళలు. 2007-08లో ఈ కార్యక్రమం ద్వారా 17.88 లక్షల పనులను చేపట్టగా వీటిలో 49 శాతం నీటి సంరక్షణకు సంబంధించినవే!!

SAKSHI